# హేమంత కోయిల

"తమరు దయ యుంచి నా ఈ పొరబాటును క్షమించి నా కుటుంబాన్ని నన్ను కాపాడమని వేడుకుంటున్నాను. ఇట్లు భవదీయ విశ్వాస పాత్రుడు..." పిరికి వెధవ.... అని నవ్వుకుంది హైమ.

ఏడాదికింద తాను కొత్తగా విశాఖపట్నానికి బదిలీ అయి వచ్చినప్పుడు యూనియన్ అని, నిరసనప్రదర్శన అని బెదరించాడు, చాటుమాటుగా కారుకూతలు కూశాడు, కూయించాడు, గోడల్ని ఖరాబు చేయించాడు, ఈ ఆడ మనిషిని హడలగొట్టి తను రాజ్యమేలుదామనుకున్నాడు మూర్ఖుడు. తాటాకు చప్పుళ్ళకు బెదరకుండా, డిగ్నిటీ చెడకుండా నడుపుకొచ్చింది తను... మొన్న ఆడిటింగ్‌లో పట్టుబడ్డాడు అదే శేషగిరి. రెండువేల దాక ఆఫీసు సొమ్ముకు అకౌంటు చెప్పలేకపోయాడు. అవినీతి కుడితిలో పడగానే పాపం మనిషి, మగ మనిషి – ఎలుక కన్న దీనంగా జారిపోయాడు. 'హుం! ఆడది' అని చులకన చేసిన మగతనం జావకారి పోయింది. ఇప్పుడు ఆ వీరశూర ప్రతాపుడే ఈ ఆడదాని దయ కావాలంటున్నాడు. క్షమించమంటున్నాడు. వీడా మగవాడు?

"ఇదుగోనమ్మా కాఫీ!" అని తెచ్చి స్టెయిన్‌లెస్ స్టీల్ కప్పు, లోటా తెచ్చి టేబిల్‌మీద వుంచి వెళ్ళింది రుక్మిణమ్మ.

ఫైళ్ళమీద నుంచి దృష్టి మరల్చింది హైమవతి. వేడివేడి కాఫీ కమ్మగా పొగలు కక్కుతూంది. హైమ లేచింది. కాఫీని లోటాలోంచి కొంచెం కప్పులోకి పోసింది. కప్పు తీసుకుని కిటికీ దగ్గరకు నడిచింది. తోటంతా రాత్రి వర్షానికి తడిసి తళ తళ మెరుస్తూంది. ఏటవాలుగా వున్న లేత అరటి ఆకుమీద నుంచి నీటి ముత్యాలు ఒక్కొక్కటే లయబద్ధంగా కిందకు జారిపడుతున్నాయి. ఒక్కొక్క బొట్టు పడ్డప్పుడల్లా కింద నున్న గడ్డిమొక్క నిలువెల్లా పులకించి నర్తిస్తూంది.

కాఫీ వేడిగా, హాయిగా వుంది. ఇలా కప్పు–లోటాలతో తాగడం తమిళ సంప్రదాయం అని మద్రాసు వదిలి వచ్చే దాక తనకు తెలియదు. దాదాపు ఇరవై

ఏళ్ళయింది, తను పుట్టి పెరిగి చదువుకున్న ఆ వూరు వదిలి, ఈ సెంట్రల్ సర్వీసెస్‌లో చేరాక, ఈ రెండు దశాబ్దాలలో నాగపూర్, లక్నో, బెంగుళూర్, ఢిల్లీ, విశాఖపట్నం – ఇలా గడిచిపోయింది.

నలభై రెండేళ్ళ జీవితంలో ఆత్మీయత, స్నేహం, తల్లిదండ్రులను కోల్పోవడం, ఎప్పుడయినా ఆరోగ్యం చెడ్డప్పుడు కుంగి, బాగవగానే పొంగడం, కొత్త మనుష్యులను తెలుసుకొని మచ్చికచేసుకుని పని చేయించడం, జాయింట్ డైరెక్టర్‌గా తన విద్యుక్త ధర్మాన్ని నెరవేర్చడం – 'హాలిడే'ల మీద వెళ్లిరావడం, పుస్తకాలు చదువుకోవడం, ఉత్తరాలు అందుకోవడం – రాయడం – ఎన్నో పుటలు నిండిపోయాయి. తిరిగి పోయాయి..... ఎక్కడా ఆగలేదు, ఆగిపోలేదు......

"ఏ మమ్మా స్నానం చేస్తావా ?" అంటూ వచ్చింది రుక్మిణమ్మ, కాఫీ కప్పు లోటా తీసుకువెళ్లింది.

ఆ ఫైలు ముగించి వెళ్ళాలి.

తప్పు చేయడం మానవ సహజం; కాని తెలిసి అవినీతిలోకి దిగడం మనిషై పుట్టినవారు చేయవలసినది కాదు. తప్పంటూ తెలిసి చేశాక శిక్షను చిరు నవ్వుతో ఎదుర్కోని వ్యక్తి మనిషికాదు. మాంసపు ముద్ద..... ఈ పాటిదానికి తగుదునమ్మా అని... మగవాడినని విర్రవీగడం; కండబలం వుంది గనుక తాను గొప్ప అనుకునేవాడు మగవాడు కాడు, మగపుటక పుట్టిన జంతువు ; శరీర స్థాయిని మించి ఎదగలేని మిస్సింగ్ లింక్.

ఆమె ఫైల్ మీద తన నిర్ణయాన్ని రాసింది. ఫైలు మూసింది. స్నానానికి లేచింది.

తలంటి పోసుకుంది.

కురు లారబెట్టుకుంటూ నిలువుటద్దం ఎదుట నిలబడింది.

నల్లని ఆకాశంమీద మెరుపుతీగల్లా కన్పించాయి నాలుగైదు తెల్ల వెంట్రుకలు.

తన జీవితానికి రజతోత్సవం ఇటీవలే ప్రారంభమైంది ! రజతం స్వర్ణం అయిననాడు తన పేరు సార్థకం అవుతుంది. ఆమె పెదవులు విరిశాయి.

తల వెంట్రుకలను వదులుగా ముడివేసుకుని నుదుట బొట్టు దిద్దుకుంది.

ఆ కుంకుమభరిణ విమల ఇచ్చింది.....విమల!

మద్రాసు కేసరి స్కూల్లో, ఆ తర్వాత క్వీన్ మేరీస్‌లో తన సహాధ్యాయి. జీవితాంతం విడిపోరాదని మెరీనా బీచిలో చేసుకున్న బాసలలో కొన్ని, విమలకు కేశవమూర్తితో పెళ్లి కాగానే ఎగిరి పోయాయి; కాని ఖచ్చితంగా నెల కొక్కటయినా ఉత్తరం రాస్తుంది విమల. తన పెళ్ళయిన కొత్తలో – "నీ పెళ్ళెప్పుడు? ఇంకా రాజకుమారుడు రానంటున్నాడా ?" అని ప్రతి వుత్తరంలో పల్లవి పాడుతుండేది. అక్కడికి పెళ్లి అనే పందెంలోకి ప్రవేశించి, మొగుణ్ణి పిల్లల్ని మోసుకుంటూ, సేవలు చేసుకుంటూ, డాక్టర్లకు ప్రదక్షిణాలు చేసుకుంటూ, తింటూ, కంటూ వుండడమే స్త్రీజన్మకు సార్థకత్వం అయినట్లు....క్రమంగా విమల ఆ పల్లవి మానేసింది. "హైమా ఎంత మొండిదానివే నువ్వు !" అని వూర్కుంది. పదిమందికి బాగన్పించింది

పదకొండో మనిషికీ బాగుండి తీరాలన్న శాసనం ఏమిటీ?

చదువు, తెలివి, రూపం, గుణం, ఆరోగ్యం వుండి వ్యక్తిగా ఉన్నతుడైన వాడి, చేత చేయివేసి చలాకీగా స్నేహంగా నడిస్తే that is worth while; అంతేగాని చొప్పదంటు అధికారం చెలాయించే మఱుగుజ్జు రౌతులకు మొండి గుఱ్ఱం కావడం, అవివేకం. పెళ్ళవనీ, ప్రేమవనీ, స్నేహమవనీ సరి సమానమైన వారి మధ్యే సాధ్యం; మిగతావన్నీ కూడా సర్దుబాట్లే, రాజీలే! ఓటమి నంగీకరించలేక, పందెం నుండి తప్పుకోలేక ఈసురోమని కాళ్ళీడుస్తున్న కేసులే!

తానా పొరబాటు చేయలేదు....ఇంత వరకూ!

– ఆరోజు, రెండేళ్ళ కిందట భిలాయి నుండి విమలా మూర్తి ఇక్కడికి వచ్చినప్పుడు -

"హైమా! ఇదెవరో చెప్పు చూద్దాం"– అని ఒక ఫోటో చూపించింది విమల. ఆ ఫోటోలో కోల మొహం, సూటిగా చూస్తున్న కళ్ళు, ఎవరా అబ్బాయి.... అని తానాలోచిస్తుండగానే– "మావాడు సురేష్.... ఈ ఏడాదే పూనా ఆర్మీ మెడికల్ కాలేజ్‌లో జాయిన్ అయ్యాడు" అంది విమల.

–విమల అంత పెద్దదా! అన్పించింది. పిల్లల పుట్టుక తలిదండ్రులను అంత వెనక్కు నెడుతుంది కాబోలు!

ఆ వారం రోజులూ ఎంతో సందడిగా సరదాగా గడిచాయి. ఎప్పుడూ సెలవు పెట్టని తాను పెట్టింది. కారు తీసుకుని శాలిహుండాం, అరసవిల్లి, కళింగపట్నం వెళ్ళారు.

శాలిహుండాం కొండమీద స్తూపం ఎంత పెద్దది.... ఎంత పాతది! రెండు వేల ఏండ్లనాడు మనిషిదుఃఖాన్ని రోగ నిదానంచేసి చికిత్సను సూచించిన మహాభిషగ్వరుడి సంకేతం అక్కడి స్తూపం.

"బుద్ధుడు మానవాళికి కరుణామయుడయితే కావచ్చు కాని యశోధర పట్ల, రాహులుడి పట్ల చాలా క్రూరంగా ప్రవర్తించాడండీ–" అన్నాడు మూర్తి.

"సృష్టి ఆదిలో నీటిలోనే వుండిన జంతువుల్లో ఒకటి తెగించి నేలమీదకొస్తే భూచరాలు పుట్టాయి. భూచరాల్లో ఒక్కటి చెట్టెక్కితే విహంగాలు వచ్చాయి. అలా, మంది తొక్కిన మార్గంనుండి విడిపోయిన వ్యక్తే ప్రగతికి దీపం అవుతాడు. దూరంగా వున్న మంచినివాళే గుర్తించడం, సమకాలీనులు గుర్తించకపోయినా దానిని అందుకుని ఆచరణలో పెట్టడం– మహాత్ముల, భావుకుల లక్షణం. అలాంటి వారు లేకపోతే మనమింకా అడవుల్లోనే పచ్చి మాంసం పీక్కుని తింటుండే వాళ్ళం–" అని ఘాటుగా జవాబు చెప్పింది హైమ.

"అబ్బ! చాల తీవ్రంగా మాట్లాడారు కాని హైమగారూ, పక్క వ్యక్తిమీద సానుభూతి ఆర్ద్రత ప్రేమలేని వారికి సమాజంమీద, మొత్తం మానవాళిమీద ఆర్ద్రత వెల్లివిరియడం ఎలా సాధ్యం అండీ?"

"అన్ని విత్తనాలూ మొలకెత్తవు, అలాగే మనిషిగా పుట్టిన ప్రతీ వ్యక్తి మనిషిగా బతకడంలేదు. ఆవు దూడను నాకుతుంది; ఒక కుక్క ఇంకొక దాని ఒంటిమీద

మురికిని నాలుకతో శుభ్రం చేస్తుంది. కాకి ఎంతో దూరం నుండి తెచ్చి ఆహారాన్ని తన బిడ్డ కందిస్తుంది. అది చాల ఎలిమెంటరీ అర్ద్రిత; ప్రిమిటివ్ అటాచ్‌మెంట్ .... బంధుత్వం ఆధారంగా, శరీరం ఆధారంగా ప్రేమ మొలకెత్త వచ్చునేమోగాని అక్కడే ఆగిపోయేవి మాత్రం మానవజన్మకు సార్థకత్వం తెచ్చేవి కావు. శరీరమంతా జంతుతత్వంతో, ఇన్‌స్టింక్ట్స్‌తో నిండిన వ్యక్తి మానసికంగా ఎదగాలి, ఎదిగి మనిషవాలి. ఆ మనిషిలాంటి కోటి కోటి మనుష్యులతో ఈ లోకమంతా మానవతా ధనుష్కోటి కావాలి. అప్పుడు నిజంగా ప్రేమకు అర్థం తెలుస్తుంది. అంతదాక మీరనే అర్ద్రిత కేవలం బురద మాత్రమే; మీరనే అనుబంధం అమాయకుల్ని బంధించే ఊబి మాత్రమే...."

"హైమా! చాల్లేవే తల్లీ! నీ వీరావేశం తగ్గించి— ఆ బుట్ట తెప్పించు తల్లీ ఆకలి అవుతోంది—" అని విమల అనడంతో ఆ వాదం ముగిసింది.

ఆ తర్వాత డ్రైవర్ జోసెఫ్, పిక్‌నిక్ బుట్ట తెచ్చి ఇచ్చాడు. ఆ కొండంచున కాళ్ళవైపు వంశధార నది మంద మందంగా పారుతుండగా, హాయిగా కూర్చుని పులిహోర, బాదంహల్వా, బిస్కెట్లు, అరటిపండ్లు— తిన్నారు ముగ్గురూ!

తింటుండగా మూర్తి అడిగాడు. "హైమాజీ! పులిహోరలో ఒక్క పచ్చి మిరపకాయయినా లేదేమండీ ?"

"నేను ఎక్కువ కారం తిననండీ... ఐయామ్ సారీ! ఇవాళ కాస్త కారం వేయమని రుక్మిణమ్మతో చెప్పి వుండాల్సింది"— అంది హైమ నొచ్చుకుంటూ.

"అబ్బబ్బ.... అది కాదే మొద్దు మొహమా! అసలు కారమే తిననిదానివి నీలో ఇంత ఘాటు ఎక్కడిదా అని మా కేశవులుగారి సంశయం!" అంది విమల.

"అది చాల పెడసరపు వ్యాఖ్యానం సుమండీ—" అని వెంటనే ఖండించాడు మూర్తి.

విమల సమాధానం చెప్పలేదు; వారి నవ్వులో తానూ కలిసింది.

ఆ మరురోజు కారుమీద వైజాగ్ – భీమ్లి రోడ్‌మీద బయలుదేరారు. ఋషి కొండ సమీపంలో ఒక సరుగుడు తోట దగ్గర ఆగారు. పేకాట, భోజనం, రేడియోలతో కొంత కాలం గడిచింది. ముగ్గురూ సముద్రం వైపు నడిచారు.

అలలలో తడిసిన ఇసుకమీద పాదాల ముద్రలు పడుతుంటే మూర్తి—

"చూడు విమలా! నా తర్వాతి తరాల వారికైనా అడుగుజాడలను వదలిపెడతా—" అంటుండగా పెద్ద కెరటం వచ్చి— అంతటినీ శుభ్రంగా తుడిచి వెళ్ళింది.

"Oh! Poor man ఇంక మానవాళికి గతి ఏమిటబ్బా?" అని విమల కళ్ళెగరవేసి కొశ్చెన్ మార్క్ ముఖం పెట్టింది.

"ఏ మహాత్ముడిని సమకాలీన సమాజం మెచ్చుకుంది గనుక!" అని చాల వేదాంతిక్‌గా ప్రవచించాడు మూర్తి.

హైమ ఫక్కున నవ్వింది. వాళ్ళిద్దరి బలవంతంతో తాను కూడా మోకాలిలోతు అలలమట్టానికి వెళ్ళింది.

ఆ పదినిముషాల అల్లరి కేరింతలు .... వయసును వెనక్కు నెట్టాయి.

ఉన్నట్లుండి ఒడ్డుకు నడవడం ఆరంభించిన విమలను పెద్ద అల వెనుక నుండి మోదడంతో పరుగెత్తబోయి కూలబడింది, తప్ప తడిసింది.

"What happened, Esther Williams?" అంటు పరుగెత్తుకు వెళ్ళాడు మూర్తి.

ఆ పడడంలో ఎడమ మడమ దగ్గర మడతపడి లేవలేకపోయిన విమల చేతిని తన మెడమీదుగా వేసుకుని ఆమె వీపు మీద చేయివేసి తీసుకెళ్ళి ఇసుకమీద కూర్చోబెట్టి, ఆమె మడమ దగ్గర నెమ్మదిగా రుద్దుతూ– "ఎలా వుంది విమలా!" అన్న మూర్తిలో కొత్త మనిషిని చూస్తూ వుండిపోయింది హైమ.

దారి పొడవునా ఆమెను కంటికి రెప్పలా మూర్తి కనిపెట్టుకుని వున్నాడు. ఆమె వద్దుమొర్రో అన్నా ఊళ్ళోకి రాగానే ప్రైవేట్ క్లినిక్‌కు తీసుకెళ్ళి ఎక్స్ - రే తీయించాడు. ఫ్రాక్చర్ ఏదీ లేదని తెలిసి 'హమ్మయ్య' అన్నాడు.

ఈ హడావిడి అంతా చూసి హైమ నవ్వుకుంటుందేమోనని విమల సంజాయిషీ ఇచ్చుకున్నట్లు– "ఎప్పుడూ ఇంతే ఈ మనిషి..... అనవసరంగా హైరాన పడిపోతారు. కాస్త తుమ్మానంటే చాలు మంచం దిగొద్దంటారు. డాక్టరని, ఇంజక్షననీ దండకం మొదలెడతారు....." అంటుంటే మధ్య మూర్తి - "అదేం కాదండీ! తన వంట బొత్తిగా బావుండదు, అంచేత ఇలాంటి సాకుతోనైనా హాయిగా కావలసింది చేసుకు తిందామనుకుంటాను. కాని ఈ 'తాటకి' అందుక్కూడా ఒప్పుకోదు–" అంటే విమల మొహం వంకర చేసి వెక్కిరించింది.

......– ఆనాడు తాను నవ్వింది. ఇపుడద్దంలో తన మొహంమీదా నవ్వేవుంది. మరి కళ్ళల్లో? చేతిలో కుంకుమ భరిణను కిందపెడుతూ హైమ /దీపావళికి భిలాయి వెళ్ళి విమలతో గడపాలి అనుకుంది.

భోజనం దగ్గర రుక్మిణమ్మ– "ఏం, హైమమ్మా! ఏం చేశావు నా మాట?" అని అడిగింది.

ఆమె హైమకు దూరపు బంధువు, భర్త వదిలివేశాడు. వేరెవ్వరూ దిక్కు లేకపోతే తనకు సాయంగా వుంటుందని ఆమెను తన దగ్గర వుంచుకుంది. వంట మనిషిగాను, ఇంటికి పెద్ద దిక్కుగాను చలామణి అవుతున్న రుక్మిణమ్మ ఈ ఇంట్లోకి వచ్చి పన్నెండేళ్ళయింది. హఠాత్తుగా ఒక నెల రోజుల కింద దాని మొగుడిని అంటూ అతగాడు ఊడిపడ్డాడు. ఉద్యోగం లేదు, జీతం లేదు, రోగాలపాలయిన శరీరంతో ఇక్కడ పెళ్ళాం పంచనచేరి ఆమెచేత ఊడిగం చేయించుకోవడానికి తయారయ్యాడు. అయితే అతడంత హఠాత్తుగా వచ్చినందుకు ఆనందించినా రుక్మిణమ్మ తొందరపడి అతడికి ఈ ఇంట్లో చోటివ్వలేదు. హైమ నడిగి చెబుతానంది. అందాక అతడు బయట ఏ గుళ్ళోనో వుంటున్నాడు. 'అతడూ ఇక్కడికి వచ్చి వుంటాడు' – అని పదిహేను రోజుల కింద రుక్మిణమ్మ అడిగినప్పుడు – హైమ ఏమీ జవాబు చెప్పలేదు. రెండు మూడుసార్లు అలాగే జరిగింది. రుక్మిణమ్మ ఒత్తిడి రెండు రోజుల నుండి ఎక్కువయింది.

చిన్నతనంలో అమెను కొట్టి, తిట్టి కాల్చుకు తిని, ఆస్తిని తాగుడుకు తందనాలకు ఖర్చుపెట్టి, అమెను వదిలి వెళ్ళి పోయి - పాతికేళ్ళ తర్వాత - అమె గుట్టుగా వేళకింత తిని గౌరవంగా, ప్రశాంతంగా బతుకు వెళ్ళబుచ్చుతుండగా పరాన్నభుక్కులా, రోగ బీజంలా ప్రవేశిస్తున్న ఆ ధూర్తుడిని అమె ఇంకా నమ్మడం ఆశ్చర్యంగా వుంది హైమకు. అయినా అమె జీవితం అమెది గనుక "నీకు భార్యా భర్తల విషయం తెలియదమ్మా-" అని రుక్మిణమ్మ అన్నప్పుడు హైమ మనసు తాచులా లేచినా నోరు వూరుకుంది.

కాని వాడిని యీ ఇంట్లోకి అనుమతించడమా! గజ్జికుక్కకన్నా నికృష్టుడు - అన్పించింది హైమకు. కాని ఆ మాట వెంటనే బయటికి అనలేక పోయింది. "అది బురద, అది కంపు!" అని పందికి ఎలా నచ్చజెప్పగలం! - అనుకుంది.

మళ్ళీ ఇవాళ సరిగ్గా భోజనం వేళ ఎత్తింది రుక్మిణమ్మ. వెధవ Pressure tactics- హాయిగా భోజనం చెయ్యనివ్వకూడదూ?

తలెత్తి రుక్మిణమ్మకేసి చూసింది హైమ.

అమె చూపులను స్వీకరిస్తూ రుక్మిణమ్మ "చెప్పమ్మా- అయన ఈ ఇంట్లోకి రావడం ఇష్టం లేకపోతే చెప్పేయి- నేనే వెళ్ళి పోతాను." అంది.

ఔరా! ఏమి ధీమా! దేన్ని చూసుకునీ? అరోగాలపుట్టను చూసుకునా? అతడు గతంలో పెట్టిన సుఖాలను చూసుకునా? తన్ను బెదిరిస్తూందన్న మాట...ఈవిడ వెళ్ళిపోతే తనకింత తిండీతిప్పలూ వుండకూడదనుకుంటూంది కాబోలు.... ఇదుగో, ఇలాంటి ఎత్తులంటేనే తనకు ఒళ్ళుమంట.

హైమ గబగబ పెరుగన్నం ముగించి చేతులు కడుక్కుని లేచింది.

"ఏమంటావమ్మాయ్?"

"రెండు మూడు రోజుల్లో చెబుతాను," అంది హైమ గంభీరంగా.

గదిలోకి వెళ్ళి పడుకుంది. సగం వదిలివేసిన CATCH-22 నవలను పూర్తిచేసేసరికి నిద్రవచ్చింది.

నిద్రలేచేసరికి నాలుగయింది. రేడియో మీద 'వివిధ భారతి' అన్‌చేసి టీ తాగుతుండగా కాలింగ్‌బెల్ మోగింది.

"మిలిట్రీ బాబుగారి నౌకరు - వచ్చాడమ్మా-" అంది పనిమనిషి.

ఆ వెనకాలే వచ్చిన నౌకరు- "అయ్యగారింకో రెండు పుస్తకాలు పంపారమ్మా" అంటూ ఒక ఎల్లిన్‌వా, ఒక గియొవోన్నా గొయెర్షి వుంచాడు టీపాయ్ మీద.

"ఏవయినా తెలుగు నవలలుంటే పట్టుకురమ్మన్నారండి." అన్నాడు వాడు.

నిజానికి అతడు- అంటే చంద్రశేఖరం- మిలిటరీ వాడుకాదు; మెరైన్ ఇంజనీరు, కొంతకాలం నేవీలో పనిచేశాడు; కొంతకాలం ప్రైవేట్ షిప్‌ల మీద పనిచేశాడు, భార్య, నాల్గేళ్ళ కూతురూ ఒక కార్ ప్రమాదంలో పోయి ఏడెనిమిదేళ్ళయిందట. అతడీ పేటలోనే ఆ చివరెక్కడో వుంటున్నట్లున్నాడు.

రోజూ పొద్దున అయిదుగంటల కల్లా వ్యాయామం నిమిత్తం పరుగెడుతుంటాడు;

అతడితోపాటే అతడి కుక్క కూడా అరుచుకుంటూ పరుగెడుతుంటుంది. ఎన్నోసార్లు పొద్దున్న తన పడగ్గది కిటికీ నుండి యధాలాపంగా చూస్తుంటే వారిద్దరూ కనపడేవారు. ఆ కుక్క– సీజర్ దానిపేరు, వంటతో సహా ఇంటి పెత్తనానికి నాయర్– తాను– ఇదీ చంద్రశేఖర్ ఫ్యామిలీ!

పోయిన సంవత్సరం ఒక పార్టీలో కలిశాడు. అతడి మాటలలో ఏదో విలక్షణంగా – అన్పించింది. తర్వాత తెలిసింది అతడు విపరీతంగా చదువుతాడని, ఇంగ్లీషులో కథలు రాస్తాడని... ఎప్పుడయినా వచ్చి ఓ గంట కబుర్లాడి వెళ్తాడు. పుస్తకాలు తెచ్చి ఇస్తుంటాడు. బ్రాంటే సిస్టర్స్, పెర్ల్ బక్, మామ్ తప్ప తెలియని తనకు వా, తార్న్‌స్మిత్, జేమ్స్ థర్బర్, ఫిల్లిస్ బాటమ్, పాల్ గేలికోల కొత్త ప్రపంచాలను పరిచయం చేశాడు చంద్రశేఖరం.

'ఏకవీర' ఇచ్చి పంపింది. ఆ నౌకర్ వెళ్ళిపోయాడు.

ఇవాళ ఆదివారం; జోసఫ్ రాడు. అంచేత అరయ్యాక కారు తనే తీసింది. నెమ్మదిగా అప్‌లాండ్స్ వైపు దారి తీసింది. రోడ్‌మీదకున్న సంపత్ వినాయగర్ కోవెల ముందు, విభూతి గీతల అడ్డపంచల వాళ్ళు గుంజిళ్ళు తీస్తున్నారు. శరణాగతి కాబోలు! డబ్బు ఎదుట, పదవి ఎదుట, రాతిబొమ్మ ఎదుట అన్నిటి ఎదుటా శరణాగతే! కాని నిజానికి 'అహం' మాత్రం చచ్చినా చావదు!! జీవన్ నగర్, లాసన్స్ బేల మీదుగా సన్–న్–సీ వైపు తిరిగింది హైమ. కాస్త ముందుకెళ్ళి కారు నొక పక్క ఆపింది. ఇసుకలోకెళ్ళి కూచుంది. నిరంతరంగా శ్రమిస్తూ నురుగులు కక్కుతుంది కడలి. ఏమి అందుకోవాలనో ఆ ఎగసెగసి పడడం? ఆ పడి లేవడం?

కాలేజి కుర్రాళ్ళు కాబోలు ఒకటి రెండు ప్రదక్షిణాలు చేసి వెళ్ళారు. పంజాబీ దంపతులు నిర్భయంగా, హాయిగా చేతులు పట్టుకుంటూ నవ్వుతూ మాట్లాడుకుంటూ వెళ్ళారు. ఆ వెనకాలే ఎవడో ఎలమంచిలి అప్పారావు లాగున్నాడు– వాడు ముందర నడచివెళితే పది అడుగుల వెనక, వంచిన తల ఎత్తకుండా నడుస్తూంది అదర్శభారత సాధ్వీమణి– అతగాడి పెళ్ళాం కాబోలు... ఈ పాటి దానికి పెళ్ళెందుకు, ఈ బీచి ఎందుకు?

నవ్వొచ్చింది హైమకు. ఆశయపు వ్యాసార్థం చిన్నదయిన కొద్దీ జీవితపు పరిధి తగ్గుతుంది కాబోలు.. .. తక్కువ పరిధిలో నిండుదనమా? ఎక్కువ పరిధిలో అన్వేషణా... ఏది చక్కని రాజమార్గము?

సంధ్య వెలుగు కూడా మందగించింది. జిజ్ఞాసువు మనసులా చీకటీ– వెలుగూ కలసివున్నాయి. ప్రకృతి సముద్రంలోకి చాచిన చేయిలావున్న డాల్ఫిన్స్ కొండమీద గిర్రున తిరుగుతూంది లైట్‌హౌస్ దీపం. ఆ వెలుగునాలుక నేలనూ నీటినీ పదేపదే నాకుతూంది. దూరంగా సముద్రం మధ్య ఆగిన నౌకలు తెప్పోత్సవంలో పాత్రధారుల్లా వున్నాయి.

"అమ్మగారండీ! బఠాణీలండీ! మరి మిక్చరండీ!" అంటూ నెత్తిమీది దుకాణాన్ని దించాడు ఒకడు.

పావలా వేరుశనక్కాయలు తీసుకుంది హైమ. చీకటి -బాగా ముదిరింది.

బఠాణీలవాడి నెత్తిమీది దీపం దూరం అవసాగింది.

మసక వెలుతురులో సముద్రం మాట్లాడే భాష అర్థమవుతున్నట్లనిపిస్తోంది.

లేచింది హైమ.

రోడ్ ఇంకా అల్లంత దూరం వుందనగా "హలో- అప్పుడే లేచి పోయారే-" అన్న పలకరింపు విని త్రుళ్ళుపడింది.

ఎవరో కాదు చంద్రశేఖరం.

"గంట సేపయింది వచ్చి... చీకటి పడుతూంది కదా అని లేచానంతే-"

"ఓ.కే; తర్వాత ప్రోగ్రాం ఏమిటి?"

"ఇల్లూ- ఏల్లిన్ వా!" అంది హైమ.

గలగల నవ్వాడు చంద్రశేఖరం.

"జగదంబాలో 'పొసైడాన్ అడ్వెంచర్' వుంది- It is a good movie- వస్తారా?"

హైమ నొసలు చిట్లించింది. ఆమె పక్కనే నడుస్తున్న అతడది చూడలేదు. కాని ఆమె వెంటనే 'ఊ' అనక పోవడం చూచి "I am sorry! నేనడగడం తప్పయితే forget it... I will drop you at your house-"

"నా బండి తెచ్చాను-"

"ఓకె! రెండో దెబ్బ కూడా కొట్టేశారు! మీరు Hat trick చేయకముందే- సెలవు తీసుకుంటాను- How is waugh?"

"ఆగండాగండి-" అని వాచి చూసి "ఇప్పుడు ఏడుంబావయింది.... అలస్యం కాలేదూ?" అంది హైమ.

"ఇంగ్లీషు సినిమా కదా? ఇంటర్వెల్ తర్వాతే అంటే ఏడున్నర తర్వాతే మొదలవుతుంది. పదిహేను నిముషాలుందింకా... అంటే రెండు పెళ్ళిళ్ళు చేసేసి సినిమాకు అందుకోవచ్చు."

"ఈ పౌరోహిత్యం కూడా చేస్తుంటారేమిటి?"

"Why not? జనానికి మేలు చేసేది ఏదయినా సరే సంతోషంగా పాల్గొంటానందులో – అన్నట్లు ఏదీ మీ కారు తాళం... నా బండిని గరాజ్ కిచ్చాను. నేను టాక్సీ మీదొచ్చాను. వాణ్ణి పంపించేస్తాను. Let me drive you please-" అంటూ కారు తలుపు తీసి లోపలికి చేయిచూపెడుతూ 'Please' అని సర్ వాల్టర్ రాలేలా దారిచేయగా హైమ మహారాణిలా ఎక్కి ముందుసీట్లో కూర్చుంది. టాక్సీవాడిని పంపేసి అటునుండి వచ్చి అతడు డ్రైవరు స్థానంలో కూర్చున్నాడు. బండి కదిలింది.

"ఈ గ్రీకులున్నారే వాళ్ళకు మనలాగే ముక్కోటి దేవతలూ వున్నారు. వాళ్ళ ఒలింపియన్ దేవతల నాయికుడి పేరు జూస్....Juice కాదు సుమండీ Zeus!"

హైమ నవ్వాపుకోలేకపోయింది.

రోడ్ మీద నుండి దృష్టి మరల్చకుండా – "ఆ జ్యూస్‌కు సోదరులే పోసైడాన్, హేడీస్‌లు టైటాన్లను ఓడించాక ఈ ముగ్గురూ విశ్వ ప్రభువులయ్యారు; ఎవరు ఏ భాగాన్ని పాలించాలి అని చీటీలు వేసి నిర్ణయించుకోగా గాలికి జ్యూసూ, నీటికి

పొసైడాను అధోలోకానికి హేడిసూ రాజులయ్యారు. ఆ విధంగా నీటికి రాజయిన 'పొసైడాన్' పేరుతోగల నౌక సముద్రంలో మునిగి పోయినప్పటి కథే ఇప్పుడు మనం చూడబోయే సినిమా–" అని వివరించాడు చంద్రశేఖరం.

సినిమా అద్భుతంగా ఉంది.

కారు నామె ఇంటిదగ్గర ఆపి, గ్యారేజిలోపెట్టి తాళాలు ఆమెచేతిలో పడేసి– "వస్తానండీ! Thank you for the company, Good night" అని చకచక నడుచుకుంటూ కనుమరుగయ్యాడు చంద్రశేఖరం.

భోజనం వద్దని ఒక కప్పు పాలు తీసుకుంది హైమ.

ఎర్లీన్ వా 'Scoop' లో ఆ పత్రికారచయిత పాట్లు చదువుతుంటే నవ్వొచ్చింది.

కొంత పుస్తకం చదివి మూసేసింది. లైటార్పేసి పడగ్గది ముందున్న వరండా లోకి పేముకుర్చీ లాక్కుని కూర్చుంది. పారిజాతం విరజాజి కలబోసిన సువాసనలను మోసుకొచ్చి అభిషేకిస్తొంది గాలి. నక్షత్రాలు, కనపడని చంద్రుడికోసం కనుసైగలు చేస్తున్నాయి.

ఆమె మనసు ఆరునెలలు వెనక్కు వెళ్ళింది.

ఢిల్లీకి నెలరోజులపాటు ట్రెయినింగ్ కని వెళ్ళిందప్పుడు. వర్కింగ్ వుమెన్స్ హాస్టల్ లో నివాసం; పండారా రోడ్ దగ్గర శిక్షణ. రెండువారాలయేసరికి తను డిపార్ట్ మెంట్ కు సంబంధించిన మినిస్ట్రీలో డిప్యూటీ సెక్రెటరీ రమేష్ చోప్రా పరిచయం అయ్యాడు. ఒకసారి ఇంటికి తీసుకెళ్ళి భార్యనీ పిల్లల్ని పరిచయం చేశాడు. అందరూ కలసి 'రేంబ్లర్'లో భోజనం చేసి ప్లాజాకెళ్ళారు ఒకరాత్రి. అతడి కంపెనీ హాయిగా వుండేది. అతడిది ఎంత సంతృప్తికరమైన జీవితమో అనుకుంది తాను. కాని Appearances are deceptive అని తెలియడానికి ఎంతోకాలం పట్టలేదు. ఒకరోజు రాత్రి చోప్రా ఇంట్లో భోజనం చేసి కారులో హాస్టల్ కు వస్తుండగా చోప్రా కారు ఇండియాగేట్ వద్ద ఆపి హఠాత్తుగా తన్ను, తన చేతిచుట్టులోకి లాక్కున్నాడు. ఒక్క క్షణం ఆశ్చర్యం... తర్వాత అతడిని విదిలించి కొట్టింది..... అంత సంస్కారవంతుడు, సంసారి అనుకున్న వ్యక్తి జులాయివెధవలా కారుకూతలు కూశాడు. తాను ఇండియా గేట్ నుండి కర్జన్ రోడ్ లోని హాస్టల్ కు నడిచే వచ్చింది. తాను ఢిల్లీ విడిచి వచ్చేసే ముందు ఆ వెధవ... క్షమాపణ కోరాడు!

శారీరకం కాని సంబంధమే వుండదా ఈ లోకంలో? శరీరం నుండి విడివడి ఎదిగిన మనిషితో మనసు కలవగా ఆ రెండు మనసులూ రెండు రెక్కలై ఎగిరి విశ్వమంతటా విహరించడం అనేది అసంభవమా? మనిషి ఇంకా ఎన్నికోట్ల సంవత్సరాలు గ్రంధులకు బానిసగా వుంటాడు? వంటకంలోకి ఉప్పువలె జీవితంలోకి సెక్స్ని కేవలం రుచికి తగుమోతాదులో వాడే రోజు రానేరాదా? ఈ డైలమా తనకేనా? ఇదివరలో ఎవరికయినా వచ్చిందా?.... తను మామూలు మనిషికాదా? శరీరం అందమైనది; అందమైన శరీరం ఆనంద కారణం. కాని మనసు కూడా జతగా నడవని శారీరక ఆనందం– అది మనిషిగా జన్మెత్తిన తర్వాత పొందదగినదేనా? అలా అసంపూర్ణమైన సంబంధాల ఫలితంగానే కాబోలు రుక్మిణమ్మ మొగుడామెను

విడిచి పారిపోయాడు. అంత చక్కని భార్య వున్న చోప్రా కుక్కలా ప్రవర్తించాడు. మరి విమల – మూర్తిల జీవితాలు ఒకేరాగం పలుకుతున్నట్లే వున్నాయి.... నిజంగా ఉన్నాయా! లేక తాను జీవితం నుండి అందరాని దానికై అర్రులు చాస్తున్నదా? కాలేజిలో మోహనరావ్ దగ్గరనుండి ఢిల్లీలో చోప్రా దాక అడది స్నేహంగా వుంటే చాలు పడకకు దారితీసేవారే కన్పించిన జీవితంలో – ఒకరు మాత్రమే భిన్నంగా కన్పించారు.... అది నిజమా....!

చాలసేపు తర్వాత హఠాత్తుగా తెలుసుకుంది హైమ తాను వరండాలో కుర్చీలో కూర్చునే నిద్రపోయానని, లేచి వెళ్ళి లోపల పడుకుంది.

మరురోజు సోమవారం, ఆఫీసు గానుగ మొదలయింది.

బుధవారం మధ్యాహ్నం డ్రైవర్ జోసఫ్ వచ్చి నిలబడ్డాడు ఆఫీసు గదిలో.

"ఏంకావాలి జోసెఫ్?" అని అడిగింది హైమ.

"పెట్రోలుకు చీటీ ఇవ్వండమ్మా–"

"మొన్న సోమవారం పాతిక లీటర్లు పోయించావే– రెండ్రోజుల్లో అయిపోయిందా?"

"అయిపోయిందండీ–"

"అయిదు రోజుల కోటా రెండ్రోజుల్లో అయిపోవడం ఏమిటి?"

"ఏమోనమ్మా.... ఇంజను మునుపటిలా కండిషన్‌లో లేదు...."

"లీటర్‌కి ఎంత మైలేజి వస్తూంది జోసెఫ్?"

"ఎనిమిది కూడా రావడం లేదండీ"

హైమ ఒక్క క్షణం ఆలోచించింది. "సరే! కారు నిక్కడే గ్యారేజ్‌లో వుంచేయి. ఆటో సర్వీస్‌కు ఫోన్ చేసి తీసుకెళ్ళి చూడమంటాను. అది వచ్చే దాక నువ్వు ఆఫీసులోనే పని చూస్తూ వుండు..."అని అతడిని జాగ్రత్తగా గమనించింది.

అతగాడి మొహం చెప్పింది.... తన విషయం తెలిసిపోవడం అతడికి నచ్చలేదని.

"నేను డ్రైవింగ్ తప్ప ఇంకే పనీ చేయలేనండీ" అన్నాడు కాస్త నిరసనగా.

"అలాగే అలాగే... ఆ విషయం తర్వాత చూద్దాం. మన గ్యారేజి రిపేరవుతూంది. అది దగ్గరుండి బాగా చేయించు." అని హైమ అతడిని పంపేసింది. వాడు రుక్మిణమ్మకు male version; ఇదొక రకమైన ఒత్తిడి..... అందులోనూ స్త్రీఅనగానే మరీను...fool.....

సాయంకాలం ఇంటిదగ్గర రుక్మిణమ్మ తన భర్త విషయం అడిగింది.

"వీలులేదు–" అని స్పష్టంగా చెప్పేసింది హైమ.

"అయితే నేనిక్కడ వుండను " అంది రుక్మిణమ్మ.

"మీ ఇష్టం–"

"నువ్వు అటు ఆఫీసు, ఇటు ఇల్లు చూసుకోలేక కష్టపడిపోతావు."అని హెచ్చరించింది రుక్మిణమ్మ.

"ఫరవాలేదు. నా విషయం నేను చూసుకోగలను. మీరుమాత్రం ఊబిలోకి దిగబోతున్నారు. మళ్ళీ పైకి రాలేరు అది చూసుకోండి."అంది హైమ.

"చాలమ్మా నీ సేవా, నీ సలహా!" అని మూతి తిప్పుకుని నడిచింది రుక్మిణమ్మ.

గంట తర్వాత, హైమ ఇచ్చిన వందరూపాయలతో తన గుడ్డల పెట్టెతో రిక్షాఎక్కి నిష్క్రమించింది రుక్మిణమ్మ. పన్నెండేళ్ళ ఒక అధ్యాయం మూతబడింది.

నిట్టూర్చింది హైమ.

చాలకాలం తర్వాత వంటగదిలోకి ప్రవేశించింది హైమ.

రెండురోజుల తర్వాత ఉదయం హడావిడిగా స్టవ్ మీద నుండి ప్రెషర్ కుక్కర్ దించి, అరుగుమీద పెడుతుంటే ఆ పక్కనే వున్న వేడివేడి పాలగిన్నె అంచుకు జరిగి కింద పడింది. ఆ పాలంతా ఎడమ పాదం మీద పడ్డంతో 'అమ్మా' అని కేక వేసి కూలబడింది హైమ. ఆ ఇంటికంతా ఆమె ఒక్కర్తే వుంది.

పాదం భగభగ మండిపోతూంది. లేచి నిలబడడానికి చాల యాతనయింది. స్టవ్ ఆర్పి పళ్ళు బిగబట్టి గోడను అనుకుని నడచుకుంటూ వెళ్ళి పడగ్గది అల్మారా తెరిచి చూస్తే ఖాళీ బర్నాల్ ట్యూబ్ వెక్కిరించింది. తేనెపూసింది పాదానికి. మంచం మీదకు పాదం లాక్కుని కూర్చుంది.

శరీరమంతా పాదం అయినంతగా మండింది. అలాగే ఓపికగా కూర్చుని రికార్డ్ ప్లేయర్ మీద ఎమ్మెస్ రికార్డు వేసుకుంది. ఆ మాధుర్యంతో కాస్త మనసు శరీరం నుండి విడివడినట్లువగా బాధ తగ్గుముఖం పట్టింది.

నిద్ర మగతలో ఆనాడు బీచిలో విమల పాదం మడతపడినప్పటి సంఘటన గుర్తొచ్చింది... మనసు మళ్ళీ ఊగిసలాడింది...

ఎలా పట్టిందో నిద్ర.

టెలిఫోన్ మోతతో మెలకువ వచ్చింది.

ఆఫీసునుండి... "రాలేదేమండీ"అని పి.ఏ.!

"ఇవాళ శెలవు చీటి పంపుతాను- ప్యూన్‌ను పంప"మంది హైమ.

ఒంటి గంటకు ప్యూన్ వచ్చాడు. వాడితో డాక్టరుకు కబురుపెడితే ఆవిడ వచ్చి-ఇంజక్షను ఇచ్చి-పాదం ఎక్కువ కాలలేదు అని భరోసా ఇచ్చి వెళ్ళింది.

సెలవు చీటీతో ప్యూన్ వెళ్ళాక కుక్కర్‌లో వున్న అన్నం, పెరుగుతో తింది. కంపెనీవారి నిమ్మకాయ ఊరగాయ తోడుగా నిలిచింది!

పుస్తకం చదువుతూ కూర్చుంది.

గడియారం అయిదుకొట్టగానే ఆఫీసు ప్యూన్ ఫైల్సేవో పట్టుకొచ్చాడు. అతడినే కాస్త కాఫీ ఉప్మా తెమ్మని పురమాయించింది.

హఠాత్తుగా చంద్రశేఖరం గుర్తుకొచ్చాడు.

టిఫిన్ తెచ్చిన ప్యూన్‌ని సైకిల్ మీద అతనింటికి వెళ్ళి ఈ పుస్తకాలిచ్చేసి వేరే పుస్తకాలు తెమ్మని పంపింది.

అరగంటలో వెనక్కొచ్చిన ప్యూన్ చెప్పిన వార్త విని షాక్ తిన్నట్లయింది.

ఆ వార్త తననంత నిర్ఘాంత పరచిందెందుకు-అన్పించింది కాసేపు తర్వాత-



కథా నిలయం
3914

చంద్రశేఖరానికి మూడు రోజుల కింద వాకింగ్‌కు వెళ్ళివస్తుండగా కళ్ళు తిరిగాయట... కింద పడిపోయాట్ట. సుజాతా నర్సింగ్‌హోమ్‌లో వున్నాట్ట.

అరగంటలో టాక్సీ తెప్పించి నర్సింగ్‌హోమ్ చేరింది హైమ.

గదిలోకి అడుగుపెట్టింది. పెద్ద బ్యాండేజి కట్ల మధ్యతల, ప్లాస్టర్‌లో కుడి చేయి... అరడుగుల విగ్రహమూ మంచంమీద పడుకుని వుంది.

అయినా ఆ కళ్ళల్లో పదును అలాగే వుంది.

"ఓహ్.... మీరా రండి! రండి! How nice... ఎలా వుంది మన surrealistic తలపాగా? ఈ చేతి ఎముకల్లో సున్నం తక్కువ వుందని కాస్త వెల్లవేశారు... అదీ సంగతి. మీ ఆఫీసు ఏమంటోంది?–"

అదే గల గల.

"ఏమయింది మీకు–?"అని అడిగిన హైమ గొంతు హైమకే కొత్తగా విన్పించింది.

"హృదయం సత్యాగ్రహం చేసింది. గుండెకాయ నాన్ కోఆపరేషన్.... ఇంత వివరంగా చెప్పక డాక్టర్లు దాన్ని ముద్దుగా Heart attack అంటారు...."

"నిజంగానా?"

"నూటికి నూరు పాళ్ళూ! వెధవది దానికీ నలభై యెదేళ్ళుగా పనిచేసి చేసి అలసట వచ్చి వుంటుంది. అంచేత 'Excuse me' అనబోయింది గాని డాక్టర్లు ఒప్పుకోవడం లేదు..."

"ఎందుకింత వైరాగ్యం"

"నాన్సెన్స్! ఇంత మంచి నర్సింగ్ హోమ్‌లో. ఏ.సి.గదిలో, ఫోమ్‌బెడ్ మీద పాలమీగడలాటి దుప్పటిమీద, హాయిగా పడుకుని మీలాంటి ఎన్‌లైటెన్‌డ్ కంపెనీలో కబుర్లాడడం కన్న హాయి ఏమి ఉంది.. .. ఇప్పుడు వైరాగ్యం ఏమిటి? I can die this minute!"అని నిండుగా నవ్వాడు చంద్రశేఖరం.

"No"అంది అప్రయత్నంగా హైమ.

అతని కళ్ళు ఆశ్చర్యంతో మునిగి ప్రశ్నలో తేలాయి.

"...You shall live for me!"

–ఆమె చేతిని తన ఎడమ చేతిలోకి తీసుకున్నాడు చంద్రశేఖరం "This is resurrection"

ఆమె తల ఊచింది!

*(యువ దీపావళి సంచిక '80)*